


# ఔన్నత్యం

కళింకోట ప్రభాకరదేవ్

కరతాళధ్వనులతో సభాభవనం మార్మ్రోగింది. 'నవసాహితి' వారు రామారావును అభినందిస్తూ, ఏర్పాటు చేసిన సన్మాన సభ అది.

రామారావు వ్రాసిన 'బలిపశువులు' నవలకు బహుమతి లభించింది. ఆ సందర్భంగా ఏర్పాటు గావించినదే ఆ సభ.

సన్మాన కార్యక్రమం ముగిశాక 'నవసాహితి' వారు సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. 'నవసమాజం' నాటిక ప్రదర్శించబడింది. ఆ నాటికను వ్రాసింది రామారావే.

రామారావుకు ప్రశంసలు, సన్మానాలు కొత్తవి కావు. ముప్పయి సంవత్సరాల వయసు దాటక ముందే అనేక సన్మానాలు రామారావుకు జరిగాయి. అభ్యుదయ రచయితగా అతనికి దేశంలో మంచి పేరుంది.

నాటిక ముగిసిన తరువాత జనం తిరుగుముఖం పట్టారు. కొందరు అభిమానులు రామారావ్ దగ్గరకు వచ్చి ప్రత్యేకంగా అభినందనలు తెలియచేస్తున్నారు. ఏవేవో ప్రశ్నలు, సందేహాలు అడుగుతున్నారు. వాటన్నిటికి చిరునవ్వుతో జవాబు చెబుతున్నాడు రామారావు. తన చుట్టూ ఉన్న వారితో అతడు మాట్లాడుతున్నాడన్న మాటేగాని, దృష్టి మాత్రం దూరంగా నిలుచుని తనవైపే చూస్తున్నావిడ మీద ఉంది.

జనం పలచబడిన తర్వాత, సభా నిర్వాహకుల దగ్గర సెలవు తీసుకుని 'ఆమె' వైపు నడిచాడు రామారావ్.

రామారావ్ తనవైపే రావటం గమనించిన 'ఆమె' రెండు చేతులనూ జోడించి నమస్కారం చేసింది.

రామారావ్ ప్రతినమస్కారం గావించాడు.

'నాపేరు లావణ్య,' అంది కోకిల కంఠంతో.

'పేరుకు తగ్గ రూపం!' మనసులోనే అనుకున్నాడు రామారావ్.

"నా పేరు... మీకు తెలుసుననే అనుకుంటున్నాను" అన్నాడు. మందహాసం గావించిందామె.

"మీ రచనలు చాలా చదివాను. మీరు ఇంత 'యంగ్' అనుకోలేదు. బహుమతి లభించినందుకు అభినందనలు" అంది.

"థాంక్యూ".

"చిన్న వయసులోనే బహుమతులు అందుకునే స్థాయికి చేరుకోవడం, సమాజంలోని సమస్యలను ప్రతిభావంతంగా సాహితీ దర్పణం పట్టడం రియల్లీ గ్రేట్" అంది.

పెద్ద ఆరిందాలాగ లావణ్య మాట్లాడుతుంటే, రామారావ్‌కు చిన్నగా నవ్వు వచ్చింది.

"ఆఫ్‌కోర్స్. కాని, నాకంటే వయస్సులో చిన్నవారైన మీరు నా రచనలను మెచ్చుకోవట నచ్చింది.

ఉగాది కార్డులు



తెలుగు సంవత్సరాదికి
తెలుగులో శుభాకాంక్షలు

1. ఉగాది ప్రెజెంటేషన్ సెట్ రు. 18
(ఎక్స్‌పోర్టు క్వాలిటీ: 12 రకాల కార్డులు)
2. ఉగాది ఎస్సార్టెడ్ సెట్ రు. 10
(12 కార్డులు)
3. శృంగారనాయికల సెట్ రు. 12.50
(8 కార్డులు)

ఉగాది కేలండర్‌లు
1978 April — 1979 March

టేబుల్‌పైన పెట్టుకోడానికి, గోడకు తగిలించుకోడానికికూడా పనికొచ్చే కొత్తరకం కేలండర్‌లు.

1. "భక్తిరంజని" రు. 5.00
(6 పేజీలు—6 చిత్రాలు: పేజీకి 2 నెలలు)
2. "వసంత విహారి" రు. 7.50
(12 పేజీలు—12 చిత్రాలు: నెలకొక పేజీ)

ఏ కేలండర్ కావాలో ఉదహరిస్తూ దాని ఖరీదును మనియార్డర్ ద్వారాగాని, పోస్టల్ ఆర్డర్ ద్వారాగాని పంపితే, రికార్డెడ్ డెలివరీపోస్టులో పంపగలము. రిజిస్టర్ పోస్టులో పంపగోరువారు అదనంగా రు. 1.50 పంపించవలెను.

**Cards Crafts Classics**
13/1, General Patters Road
Post Box No. 2421
MADRAS-600 002, INDIA
Grams: "CARDCRAFTS"
Phones: 812208 & 83792

రియల్లీ వెరీ గ్రేట్ థింగ్. ఎందుకంటారేమో, సమస్యలతో తల వేడెక్కించే నారచనలు యువతరానికి గిట్టవు. వాళ్ళకు కావల్సినవి ప్రేమ కథలు.

రామారావ్ మాటలకు లావణ్య అనంగీకార సూచనగా చూసింది.

"మీరు పొరబడుతున్నా రనుకొంటున్నాను. వయసును బట్టి అభిరుచులను అంచనా వెయ్యడం తప్పుదారి పట్టడమవుతుంది. అభిరుచి కేవలం వ్యక్తి మానసిక స్థాయికి సంబంధించిన విషయం. మిమ్మల్నే ఉదాహరణగా తీసుకోండి. మీ వయసుగల రచయితలు నూటికి తొంభై మంది వ్రాసేవి చచ్చు ప్రేమ కథలు. కాని మీవంటి వారు మాత్రం అందుకు భిన్నంగా సమాజంలోని అట్టడుగు వర్గాల సమస్యలను హృద్యంగా చిత్రీకరిస్తున్నారు" అంది.

లావణ్య సునిశిత విమర్శనా ధోరణికి రామారావ్ ముగ్ధుడయ్యాడు. ఆమెవైపు మెచ్చుకోలుగా చూస్తూ "మీ వంటి ఉత్తమాభిరుచి గలవారు పరిచయం కావడం నా అదృష్టం." అన్నాడు.

చిన్నగా నవ్వింది లావణ్య. పలుచని పెదవుల మీద మెరిసిన ఆ నవ్వు, చిరుగాలికి కదిలిన నీటి అలలాగ ఉంది.

"ఇప్పటికే ఆలస్యమయింది. వస్తానండి." మరోసారి, రామారావ్‌కు నమస్కారం చేసి వెళ్ళిపోయింది లావణ్య.

* *

రోజులు దొర్లిపోతున్నాయి.

రామారావ్ దిన చర్యలో పెద్దమార్పేమీ లేదు. పగలంతా ఆఫీసుల చుట్టూ ఉద్యోగం కోసం తిరగడం, రాత్రి రూమ్‌కి వచ్చి వ్రాసుకోవడం.

సంవత్సరం క్రిందట రామారావ్ ఉద్యోగం సంపాదించుకోవటం కోసం హైద్రాబాద్ వచ్చాడు. మిత్రుడి రూములో మకాం పెట్టాడు. రోజులు, నెలలు గడిచినా ఉద్యోగం దొరకలేదు. తన మీదనే ఆశలు పెట్టుకుని, పల్లెటూర్లో ఎదురు చూస్తున్న తల్లిదండ్రుల దగ్గరకు నిరుద్యోగిగా వెళ్ళడం రామారావ్‌కు ఇష్టంలేదు.

ఉద్యోగాన్ని సంపాదించుకోవాలి.

కొన్నాళ్ళు పనిచేసి, డబ్బు కూడబెట్టి దానితో చెల్లెలి పెళ్ళి చెయ్యాలి.

తమ్ముణ్ణి చదివించాలి.

నిత్యం తన బాధ్యతల్ని గుర్తు తెచ్చుకుంటూ, ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు రామారావు. ఎంత ప్రయత్నించినా ఉద్యోగం దొరకడం లేదు.

రాజధాని నగరంలో రామారావు లాంటి నిరుద్యోగి బతకడం కష్టం. రచనల వలన అప్పుడప్పుడూ డబ్బు వస్తుండటం వలన, స్నేహితుడి దార్యంవలన సంవత్సరం గడిచినా, ఉద్యోగాన్వేషణ చేస్తూ ఇంకా హైదరాబాద్‌లో ఉండగలుగుతున్నాడు.

ఒక కెమికల్స్ కంపెనీలో క్లర్క్ పోస్టు ఖాళీగా ఉందని ఎవరో చెబితే, దానికో అప్లికేషను పడేసి వచ్చి రూమ్‌లో కూర్చున్నాడు రామారావ్.

సమయం, సాయంత్రం అయిదు గంటలయింది.

పనిమనిషి ఫ్లాస్కులో కాఫీ తెచ్చి బల్లమీద ఉంచి వెళ్ళిపోయింది.

కాఫీ తాగ బుద్ధి పించలేదు రామారావ్‌కి. రోడ్డు మీద తిరుగాడే జనాన్ని చూస్తూ కూర్చున్నాడు. ఇంతలో ఒక రిక్షా వచ్చి, రామారావ్ రూమ్‌కి ఎదురుగా ఉన్న ఇంటిముందు ఆగింది.

అందులోనుండి ఒక మెరుపు తీగె దిగింది.

ఆ మెరుపు తీగెను చూస్తూనే ఉలిక్కిపడ్డాడు రామారావ్.

ఆ మెరుపు తీగ లావణ్య!

సన్మాన సభలో పరిచయమైన లావణ్య!

ఆమె రూపం రామారావు మనసులో ఏమాత్రం చెరిగిపోలేదు.

గబుక్కున లేచాడు రామారావు.

అప్పటికే లావణ్య రిక్షావాడికి రూపాయి కాగితం ఇచ్చి, ఎదురుగా ఉన్న ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఆ ఇంట్లో ఒక బెంగాలీబాబు ఒంటరిగా ఉంటున్నాడు. అతని గుణం మంచిది కాదని చుట్టుపక్కల ఉన్న వారు అనుకోవడం రామారావ్ ఇదివరకు చాలా సార్లు విన్నాడు.

లావణ్య బెంగాలీబాబు ఇంట్లోకి వెళ్ళడం రామారావ్‌కు నచ్చలేదు.

లావణ్య కోసం ఎదురుచూస్తూ గుమ్మంలో నిలుచున్నాడు. గంట తరవాత, బెంగాలీబాబు ఇంట్లో నుండి బయటకు వచ్చింది లావణ్య.

గబగబా ఆమె దగ్గరకు వెళ్ళి, పలకరించాడు రామారావ్. అతణ్ని చూడగానే లావణ్య ఆశ్చర్యపోయింది.

రూమ్‌కు ఆహ్వానించాడు. లావణ్య కాదనలేదు.

"మిమ్మల్ని ఇంత త్వరగా మరల కలుస్తాననుకోలేదు" అంది కుర్చీలో కూర్చుంటూ.

ఫ్లాస్కులోని కాఫీని కప్పులోకి పోసి ఆమెకు ఇచ్చాడు రామారావ్.

"నేను మాత్రం మీ కోసం ఆ రోజు నుండి ఎదురు చూస్తున్నాను." అన్నాడు. విస్మయంగా చూసింది లావణ్య. విశాలమైన కళ్ళు మరింత విశాలమయాయి.

"కొందరితో పరిచయాలు శాశ్వతంగా గుర్తుంటాయి. ఆరోజు మీ పరిచయం లభించాక, మరల మీరెక్కడైనా కనిపిస్తే బాగుండుననిపి అనుకున్నాను."

"ఆఫ్‌కోర్స్. నేనూ అలాగే అనుకున్నాను" అంది లావణ్య.

రామారావ్ సంభ్రమంగా చూశాడు. అతని కళ్ళలో మెరుపు గమనించింది లావణ్య.

"మీరు ఉద్యోగం చేస్తున్నారా?" గదిని పరిశీలనగా చూస్తూ ప్రశ్నించింది.

"లేదు. ఉద్యోగం గురించి ప్రయత్నిస్తున్నాను" అన్నాడు. లావణ్య తల పంకించింది.

తన కుటుంబ పరిస్థితిని సంకోచించకుండా వివరించాడు. ఆ తరవాత ఇద్దరూ కొంతసేపు

ఆధునిక సాహిత్యం తీరు తెన్నుల గురించి మాట్లాడు కున్నారు.

బాగా చీకటిపడడం గమనించి, కుర్చీలో నుండి లేచింది లావణ్య.

"వెళ్ళొస్తాను రామారావ్‌గారూ!" అంది.

"మీ అడ్రసు ఇవ్వండి.

"ఎందుకు?"

"ఎప్పుడైనా మిమ్మల్ని కలవాలనుకున్నప్పుడు రావడానికి అభ్యంతరమా?"

"ఊహూఁ. అటువంటిదేంలేదు. అయినా, ఎందుకు లెండి. మీ రూం తెలిసింది కదా. నేనే వస్తుంటాను." నేర్పుగా అంది.

లావణ్య తన అడ్రసు చెప్పక పోవడం రామారావ్‌కి కొంత బాధ కలిగించినా, రూంకి వస్తుంటానని లావణ్య చెప్పడంతో అమితంగా సంతోషించాడు.

లావణ్య వెళ్ళిపోయింది.

రామారావ్ మనసులో తీయని ఆలోచనల్ని చెలరేగాయి.

సమయం చూసి లావణ్యతో తన మనసులోని సంగతిని తెలియపరచాలి అనుకున్నాడు.

ఆ తరవాత నాలుగైదుసార్లు లావణ్య రామారావ్ రూంకి వచ్చింది. ఇద్దరూ గంటల తరబడి ఎన్నో విషయాల గురించి మాట్లాడుకున్నారు. కాని రామారావ్ తన మనసులోని విషయాన్ని చెప్పలేదు.

*    *    *

ఆరోజు శనివారం.

రామారావ్ చాలా హుషారుగా ఉన్నాడు. అందుకు కారణం ఉద్యోగం లభించడం. సోమవారంనాడు ఉద్యోగంలో జాయినవమంటూ ఆర్డరు వచ్చింది.

'ఇక తన కష్టాలు గట్టెక్కాయి' అనుకున్నాడు రామారావ్. ఆ సాయంకాలం లావణ్య రామారావ్ రూంకి వచ్చింది.

రామారావ్ అపాయింట్‌మెంట్ లెటరును గర్వంగా లావణ్యకు చూపించాడు. దాన్ని చదివి "కంగ్రాచ్యులేషన్స్" అంటూ అభినందించింది.

"ఉద్యోగం దొరికింది కదా! మరింక, మీకు తీరిక దొరకదనుకుంటాను. రచనా వ్యాసంగం కుంటుపడినట్లే" అంది.

"నో...నో... నేను వ్రాసేది రాత్రివేళ కనుక నా రచనా వ్యాసంగం కుంటుపడుతుందన్న సమస్య లేదు." అని చెప్పాడు.

కొద్దిసేపు గడచిన తరవాత రామారావ్ అసలు విషయానికి వచ్చాడు. చాలా రోజుల నుండి మనసులో దాచుకున్న విషయాన్ని మెల్లగా లావణ్య దగ్గిర వెల్లడించాడు. లావణ్య ఆశ్చర్యపోలేదు. ఎప్పుడో ఒకప్పుడు ఇటువంటి సన్నివేశం ఎదురు అవుతుందని అనుకుంది. ఎదురవాలని ఆశించింది.

రామారావ్ చెప్పిన దానికి పెదవిని ముని పంటితో నొక్కి పెట్టి, అలవోకగా చూసింది.

"మీరు తొందరపడుతున్నారని నేను అనుకుంటున్నాను. నా జీవితం గురించి తెలిస్తే, బహుశా మీరు నన్ను



చిత్రం—రాజేంద్ర (మద్రాసు)

అసహ్యించుకోవచ్చు...." అంది లావణ్య.

ప్రశ్నార్థకంగా చూశాడు రామారావ్. అతని మనసులో చీకటి తెరలు మెల్లగా వదిలాయి.

నుదుట అస్తవ్యస్తంగా పడిన ముంగురుల్ని కుడిచేతో సవరించుకుని రామారావ్ వైపు చూసింది లావణ్య.

"నా జీవితం విషాదకరమైంది రామారావ్ గారూ! నా వంటి వాళ్ళను చూసి లోకం జాలిపడవచ్చు గాని ప్రేమించలేదు. ముసలితల్లి, ఇద్దరు తమ్ముళ్ళు, ఒక చెల్లి నాకు ఉన్నారు. వాళ్ళను పోషించాల్సిన బాధ్యత నామీద ఉంది. ఆ బాధ్యతను నిర్వర్తించడానికి నా వయస్సు తప్పించి మరో మార్గం కనిపించలేదు. బాధ్యత నన్ను చీకటిబతుకులోకి తరిమింది." గంభీరంగా చెప్పింది లావణ్య.

మనసులో దుఃఖాన్ని బలవంతంగా అదిమిపెట్టుకుని, పైకి గంభీరంగా నటిస్తుందని అంచనా వెయ్యగలిగాడు రామారావు.

"నా గురించి చెప్పాను. నిజం తెలిసిన తరవాత మీరు మనసు మార్చుకోకుండా ఉండగలరా?" ఆశగా చూస్తూ అడిగింది.

రామారావు ఏమాత్రం ఊహించని సన్నివేశం అది. తన కథ ఇటువంటి మలుపు తిరుగుతుందని అతను అనుకోలేదు.

లావణ్య రామారావ్ జవాబు కోసం ఆత్రంగా చూడసాగింది. రామారావ్ మౌనం ఆమెకు దుర్భరంగా ఉంది.

కొంతసేపు వేచి చూసి, కుర్చీలోనుండి లేచింది లావణ్య.

"మీరు నిజాన్ని తట్టుకోవడానికి కొంత టైమ్ పడుతుంది. బాగా ఆలోచించి, ఒక నిర్ణయానికి రండి. నా అడ్రసు ఇస్తాను. వారం రోజుల లోపల మీరు మీ మనసు మార్చుకోకుండా ఉండేటట్లయితే, మా ఇంటికి వచ్చి మా మదర్‌తో మాట్లాడండి. అమె మీ మాట కాదనదు." టేబుల్ మీద ఉన్న లెటర్‌పాడ్ మీద తన చిరునామా వ్రాసి, రామారావ్ దగ్గిర సెలవు తీసుకుని వెళ్ళిపోయింది లావణ్య.

ఆ తరవాత నెలరోజులు గడిచినా, ఆ చిరునామాతో అవసరం లేకపోయింది రామారావ్‌కి.

*    *    *

రాత్రి తొమ్మిదిన్నరయింది.

టాంక్‌బండ్ బస్‌స్టాప్ దగ్గిర నిలుచుని బస్ కోసం వెయిట్ చెయ్యసాగాడు రామారావ్. అతని ముందు ఎర్రరంగు ఫియట్ కారు సడన్‌బ్రేక్‌తో ఆగడంతో ఉలిక్కిపడి చూశాడు.

కారులో లావణ్య!

ఒక్కర్తే డ్రయివింగ్ సీటులో కూర్చుని ఉంది.

"రండి మీ రూమ్ దగ్గిర డ్రాప్ చేస్తాను" సన్నగా నవ్వుతూ అంది.

ఆశ్చర్యంతో రామారావ్‌కు నోట మాట రాలేదు. మౌనంగా కారెక్కి కూర్చున్నాడు.

"మీకు... వివాహమయిందా?"

"లేదు."

"మరి, ఈ కారు? అనుమానంగా చూశాడు. లావణ్య కుటుంబ పరిస్థితి ఎటువంటిదో అతనికి తెలుసు. లావణ్య ఇదివరకే చెప్పింది.

"మాదే.. మా ఫాదర్ నిన్ననే బొంబాయి నుండి తెప్పించారు."

"మై గాడ్!" నోరు తెరిచాడు రామారావ్.

"మా ఫాదర్ పెద్ద ఇండస్ట్రియలిస్ట్." కారు గేరుల్ని మారుస్తూ చెప్పింది లావణ్య.

"అయితే... ఆరోజు మీ కుటుంబం గురించి చెప్పింది...."

"అంతా అబద్ధం" వాక్యం పూర్తి చేసింది.

రామారావ్ ముఖం పాలిపోయింది.

"అయితే... అబద్ధం ఎందుకు చెప్పారు?" నీరసంగా ప్రశ్నించాడు. ఇదివరకు, లావణ్య వ్రాసి ఇచ్చిన అడ్రసును చిత్తుబుట్టలో పడేసినందుకు మొట్టమొదటిసారిగా నొచ్చుకున్నాడు.

రామారావ్ ప్రశ్నకు లావణ్య నవ్వింది.

"చిన్నప్పటి నుండి సాహిత్యమంటే నాకు ఎంతో అభిమానం. పుస్తకాలు తెగ చదువుతాను. మీ రచనలు కూడా చదివాను. మీ రచనల్లో కనిపించే ఔన్నత్యం, ఆదర్శాలు నన్నెంతో ఆకర్షించాయి. కాని, ఏం లాభం? రచనల్లో ఎదిగారే గాని, మనిషిగా ఎదగలేక పోయారు. మీ గురించి నేనెంతో గొప్పగా ఊహించుకున్నాను. నా ఊహ నిజం కాదని తేలిపోయింది" అంది. ఆమె మాటల్లో లీలగా ధ్వనించిన 'బాధ' రామారావ్ హృదయాన్ని తాకలేదు.

రూమ్ దగ్గిర కారు ఆపింది లావణ్య. మౌనంగా, దోషిలా కారు దిగాడు రామారావ్. ★